andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3, కనిష్ఠం 24.5



జాతర ఏర్పాట్ల పరిశీలించిన పోలీసులు

దిలావర్‌పూర్, మార్చి 5 : మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని కదిలి, కాల్వ ఆలయాల్లో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై సుమాంజలి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. భారీ ఎత్తున వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. భక్తులకు మంచినీటి సదుపాయంతో పాటు క్యూ లైన్‌లో ఉన్న భక్తులకు నీడ కోసం అవసరమైన చోట టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. కాగా శ్రీ పాపహరేశ్వరస్వామిని, కాల్వలక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయా ఆలయాల చైర్మన్లు వెంకట్‌రావు, మహేష్, ఆలయాల సీనియర్ అసిస్టెంట్లు శివ కేశవ్, మాధవరావులు ఉన్నారు.



పిచ్చిమొక్కలతో కుంచించుకుపోయిన కాలువ

మరమ్మతులకు నోచుకోని సరస్వతీ కాలువ

- శాశ్వత మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరిన కాలువ
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- ప్రతీఏటా సాగునీటి కోసం అన్నదాతల అగచాట్లు
- నాణ్యత లేకుండా తాత్కాలిక సర్దుబాటు పనులు
- భారీ వర్షాలు, వరదలకు చాలా చోట్ల కాలువకు బుంగలు

నిర్మల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దాదాపు 30వేల ఎకరాలకు సాగునీరును అందించే సరస్వతీ కాలువ పరిస్థితి రోజు రోజుకు దయనీయంగా మారుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించిన సరస్వతీ కాలువ ద్వారా సోన్, నిర్మల్, లక్ష్మణచాంద, మామడ మండలాల మీదుగా ఖానాపూర్, కడెం వరకు నీరు ప్రవహిస్తోంది. అయితే ప్రతీఏటా ప్రవాహ ఉధృతి, భారీవర్షాలు, వరదల కారణంగా ఈ కాలువ భారీగా దెబ్బతింటోంది. ఏ ఏటికి ఆ ఏటా మరమత్తులు చేయకపోతుండడంతో క్రమంగా ఈ కాలువ పరిస్థితి అధ్వాన్నంగా మారింది. అధికారులు తూతూమంత్రంగా తాత్కాలిక ప్రాతిపాదికన మరమ్మతులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత మరమ్మతులపై దృష్టి కేంద్రీకరించకపోతుండడం కాలువకు శాపంగా మారింది. ప్రతిఏటా రైతులు ఈ కాలువ ద్వారా రబీ సీజన్ ముగింపులో సాగునీరు అందించాలని కోరుతున్నప్పటికీ కాలువ పరిస్థితి అధ్వాన్నంగా మారిపోవడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించలేకపోతున్నారు. 2001-2004 సంవత్సరం వరకు దాదాపు రూ.36 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు రెండు దశాబ్దాలకు పైగా అధికారులు సరస్వతీ కాలువ వైపు దృష్టి కేంద్రీకరించకపోతుండడం విమర్శలకు తావిస్తోంది. ప్రతీఏటా మరమ్మతులు లేక ఈ కాలువ ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదంలో ఉందంటున్నారు. శాశ్వత మరమ్మతుల కోసం సంబంధిత అధికారులు ఇప్పటికే చాలాసార్లు ప్రతిపాదనలు రూపొందించి సర్కారుకు నివేదించినప్పటికీ సర్కారు మాత్రం ఈ దిశగా కన్నెత్తి కూడా చూడలేదంటున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, ఎప్పటికప్పుడు నిధులు మంజూరుకాకపోవడంతో సరస్వతీ కాలువ పరిస్థితి దయనీయంగా మారింది. ఈ కాలువపై ఆశలు పెట్టుకొని సాగుపనులు చేస్తున్న రైతులకు ప్రతిఏటా నిరాశ తప్పడం లేదు. అడుగడుగునా లీకేజీలు, బుంగలు ఏర్పడడం సాధారణమైంది. ముఖ్యంగా అండర్ టన్నెల్, సూపర్ ప్యాసెజ్, డిస్ట్రిబ్యూటరీలు, డ్రాప్స్ లైనింగ్ లాంటి పనులు చేపట్టకపోతుండడం ఈ కాలువ అస్థిత్వానికి ప్రశ్నార్థకమవుతోంది. అయితే సరస్వతీ కాలువకు ఇరువైపులా కూడా దట్టమైన పొదలు, చెట్లు పెరిగిపోవడం, కాలువలో సైతం పిచ్చిమొక్కలు, ఇతర చెట్లు ఏపుగా పెరగడం నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతోంది. 2008-2009 సంవత్సరం వరకు అడపాదడపా మరమ్మతులు చేపట్టినప్పటికీ ఇక అప్పటి నుంచి ఈ కాలువ వైపు ప్రజాప్రతినిధులు శాశ్వత ప్రాతిపాదిక వైపు దృష్టి కేంద్రీకరించలేదంటున్నారు. మొత్తం సరస్వతీ కాలువకు 28 డిస్ట్రిబ్యూటరీలు ఉండగా మొత్తం 26 డిస్ట్రిబ్యూటరీల వరకు సరస్వతీ కాలువ ద్వారానే అందిస్తారు. మొత్తం 30వేల ఎకరాల వరకు పంటలు ఈ సాగునీటి కాలువపైనే ఆధారపడి ఉంటాయి. కాగా కడెం ప్రాజెక్టు పరిధిలోకి మాత్రం 27,28 డిస్ట్రిబ్యూటరీలు చేరుకుంటాయి. కొద్దిరోజుల క్రితం సరస్వతీ కాలువను ఆధునీకరించాలంటూ రైతులు పెద్దఎత్తున ఆందోళనలు కూడా చేపట్టారు. రాస్తారోకోలు ఇతర ఆందోళనలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చినప్పటికీ ప్రభుత్వం కనికరించకుండా నిధులు విడుదల చేయలేదు. ప్రతిఏటా చాలాచోట్ల కాలువ దెబ్బతినడం, వరద తాకిడికి కొంత కొట్టుకుపోవడం లాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

2004 సంవత్సరం నుంచి విడుదల కాని నిధులు

కాగా సరస్వతీ కాలువను మొదట్లో ఎప్పటికప్పుడు ఆధునీకరించినప్పటికీ 2004 సంవత్సరం నుంచి మాత్రం కాలువ మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. దీంతో కాలువ వర్షాలు, వరదలతో దెబ్బతినప్పటికీ కేవలం తాత్కాలిక మరమ్మతులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు నిధులు విడుదల చేయడం లేదు. నిధుల కొరత కారణంగా సంబంధిత శాఖ అధికారులు తూతూ మంత్రపు మరమ్మతులతో పని పూర్తయ్యిందనిపిస్తున్నారు. కాలువకు సంబంధించి అండర్ టన్నెల్, సూపర్ ప్యాసెజ్, డిస్ట్రిబ్యూటరీ లాంటి పనులను చేపట్టలేకపోతున్నారు. అయితే 2008-2009 సంవత్సరంలో మరమత్తులు చేపట్టినప్పటికీ ఆ మరమత్తులకు సంబంధించిన ఆనవాళ్లన్నీ వరదఉధృతికి కొట్టుకుపోయే అవకాశం ఉంటుందంటున్నారు. ప్రభుత్వం దాదాపు 30వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రధానకాలువను నిర్లక్ష్యం చేయడమే కాకుండా నిధుల మంజూరుపై వివక్ష ప్రదర్శించిందంటున్నారు. దీని కారణంగా అధికారులు కేవలం తమ ప్రతిపాదనలను రూపొందించడం వాటిని ప్రభుత్వానికి పంపడం, ప్రభుత్వం స్పందించకపోతుండడం లాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయంటున్నారు.

జిల్లాలో 26 డిస్ట్రిబ్యూటరీలు

సరస్వతీ కాలువ కింద జిల్లాలో మొత్తం 26 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. దీనికి అదనంగా మరో రెండు డిస్ట్రిబ్యూటరీలు కడెం మండల పరిధిలోకి వస్తున్న కారణంగా ఆ రెండు డిస్ట్రిబ్యూటరీలకు కడెం ప్రాజెక్ట్ నుంచి ఫీడింగ్ ఇస్తారు. మొత్తం సర్కారు లెక్కల ప్రకారం జిల్లాలోని 26వ నంబర్ డిస్ట్రిబ్యూటరీ వరకు 21,874 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కావాల్సి ఉంటుంది. అయితే రైతులు సాగునీటి కోసం క్రమంగా గొంతెత్తే పరిస్థితులు తలెత్తుతున్నాయంటున్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సరస్వతీ కాలువ ఆధునీకరణ విషయమై ప్రభుత్వంతో చర్చించారంటున్నారు. అయితే సరస్వతీ ఆయకట్టు రైతాంగం ప్రతీఏటా సాగునీటి కోసం రోడ్డెక్కి నినదించడం సాధారణంగా మారిపోయింది. గత ప్రభుత్వ మొండి విధానాల కారణంగా అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోతోందంటున్నారు. సరస్వతీ కాలువ చివరి ఆయకట్టు వరకు నీటిని తీసుకువెళితే భూగర్భ జలాల పెంపు సామర్థ్యం కూడా గణనీయంగా పెరుగుతోందంటున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో రైతులు సరస్వతీ కాలువను నమ్ముకునే పంటలను సాగుచేయడం రివాజుగా మారుతోంది. ప్రభుత్వం సరస్వతీ కాలువ ద్వారా వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తే కొంత మేరకైనా ప్రయోజనం ఉండవచ్చంటున్నారు. మొత్తానికి కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా సరస్వతీ కాలువపై ప్రత్యేకదృష్టి సారించాలంటున్నారు. జిల్లాలో పురాతనమైన సరస్వతీ కాలువ ఈ ప్రాంత రైతుల కన్నీటి గోసలను తీర్చే కల్పతరువుగా అభివర్ణిస్తుంటారు. ఇలాంటి బృహత్తరమైన కాలువను అప్పటి ప్రభుత్వం పట్టించుకోకుండా కొత్తకాలువల మోజులో పడిందంటున్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత మరమత్తుల కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని అలాగే ప్రభుత్వపరంగా అందే ఆర్థిక సహకారాన్ని అందించాలని రైతులు కోరుతున్నారు.

కెనాల్‌కు మరమ్మతు పనులు చేపట్టండి



జిల్లాలో సాగునీరు అందించే ప్రధాన సరస్వతీ కాలువకు మరమ్మతు పనులు చేపట్టండి. దశాబ్దకాలంగా మరమ్మతు పనులు చేయకపోవడంతో ప్రధాన కాలువతో పాటు ఉపకాలువలు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ముఖ్యంగా సరస్వతీ కాలువ ఇరువైపులా చెట్లు పెరిగిపోయాయి. కాలువ కుంచించుకు పోయింది. ప్రవాహవేగం తగ్గిపోయి రోజురోజుకు సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి శాశ్వత నాణ్యతతో కూడిన మరమ్మతు పనులు చేపట్టాలి.

- షేక్ మోహినొద్దీన్, మాజీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్

పిచ్చిమొక్కలను తొలగించి సిమెంట్ లైనింగ్ వేయాలి



ఉపకాలువల్లో ఎక్కడికక్కడ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇవి చాలదన్నట్లుగా చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులు, బండరాళ్లతో ఈ కాలువలన్నీ నిండిపోయాయి. దీంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందే పరిస్థితి లేదు. ఎక్కడికక్కడ గండ్లు పడడం ద్వారా నీరంతా వృధాగా పోతోంది. డి-16 అనే పేరు గల ప్రధానకాలువ నుంచి మల్లాపూర్, మాచాపూర్, మునిపెల్లి శివారు భూములకు నీటిని సరఫరా చేసే ఈ ఉపకాలువ మరి అధ్వాన్నంగా ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయడంతో పాటు సిమెంట్ లైనింగ్ వేస్తే రైతుల కష్టాలు దూరమవుతాయి.

- మేదరి నర్సయ్య, మునిపెల్లి, మండలం : లక్ష్మణచాంద



ఓలా విఠలేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు

కుంటాల, మార్చి, 5 : మండలంలోని ఓలా గ్రామంలో గత ఏడాది ప్రారంభించిన శ్రీ రుక్మిణి సహిత పాండురంగ విఠలేశ్వర స్వామి ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం రెండవ రోజు మంగళవారం ఘనంగా కొనసాగింది. వేద పఠనం, కర్మణ పుణ్యహవచనం, మండపారాధన, హోమం, రుద్రస్వంగకారము, కుంకుమార్చన, చండిహోమము, హారతి, మంత్రపుష్పము, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్



ధరణి ప్రక్రియ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సారంగాపూర్, మార్చి 5 : పెండింగ్‌లో ఉన్నటువంటి సాగు భూముల రికార్డులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. మంగళవారం మండలంలోని కౌట్ల(బి)లో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు నిర్వహిస్తున్న ధరణి ప్రక్రియ కేంద్రాన్ని ఆయన పరిశీలించి ధరణిలో ఉన్నటువంటి పెండింగ్ కేసుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు గ్రామాల్లోని రైతుల అభిప్రాయాలను తెలుసుకొని నివేదికలను తయారు చేయాలని పేర్కొన్నారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న సాగు భూమి వివరాలను రైతులను అడిగి తెలుసుకుని అధికారులు తయారు చేసిన నివేదికను పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దార్ శ్రీదేవి, డీటీ రవీందర్, ఆర్ఐ ముంతాజ్‌లతో పాటు అధికారులు ఉన్నారు.

కూలిన కల్లూరు-బూర్గుపల్లి బ్రిడ్జి.. నిలిచిన రాకపోకలు



కల్లూరు-బూర్గుపల్లి గ్రామాల మధ్య కూలిన వంతెన

కుంటాల, మార్చి 5 : మండలంలోని కల్లూరు నుంచి పాత బూర్గుపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి మంగళవారం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడం వల్లే కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. 25ఏళ్ల క్రితం కల్లూరు - పాత బూర్గుపల్లి గ్రామాల మధ్యన గల వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ఈ వంతెన నిర్మించారు. ఈ వంతెన పై నుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మంగళవారం ఒక్కసారిగా వంతెన కూలిపోవడంతో.. సమీపంలో ఉన్న జనం భయాందోళనకు గురయ్యారు. ఎవరూ లేని సమయంలో వంతెన కూలడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. కాగా.. అప్పటి అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్మాణంలో నాణ్యతలోపం కారణంగానే వంతెన కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతోనే నైపుణ్యాభివృద్ధి : కలెక్టర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



విద్యార్థుల అలరించిన నృత్య ప్రదర్శన

నిర్మల్ కల్చరల్, మార్చి 5 : విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొంటే వారిలోని నైపుణ్యాలు, విద్యాసామర్థ్యాలు పెంపొందుతాయని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అన్నారు. మంగళవారం విద్యాశాఖ, మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికల ఆశ్రమ పాఠశాల ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు ప్రశ్నించడం, నేర్చుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభిరుచి పెంచుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు ఆవిష్కరిస్తారన్నారు. మన జీవితం శాస్త్ర సాంకేతికతతో ముడిపడి ఉందని విద్యార్థులు గ్రహించేలా బోధనలు ఉండాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈ ప్రదర్శనలో పాల్గొనడం సంతోషమన్నారు. విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరై మాట్లాడుతూ... విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీసేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు అందుకు తగ్గ విధంగా విద్యార్థులను చిన్ననాటి నుండే ప్రోత్సహించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి మౌలిక సౌకర్యాల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని కష్టపడి చదవాలని, తల్లిదండ్రులకు మంచి పేరుప్రతిష్టలు తెచ్చి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పలు పాఠశాలల నుండి 300లకు పైగా విద్యార్థులు పాల్గొని వారి ప్రదర్శనలు ఆవిష్కరించి ఆకట్టుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, సంక్షేమ అధికారి పి వై రమేష్, ఎంఈవోలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

నిర్మల్ మండలం కౌట్ల(కే) గ్రామంలో మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ధరణి పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో రికార్డులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కార్యదర్శులు, రెవెన్యూ బృందం దరఖాస్తుదారుల భూములు పరిశీలించి సరిపోల్చుకోవాలన్నారు. నర్సరీని పరిశీలించారు. కమిషనర్ రాజు, తహసీల్దార్ సంతోష్, సిబ్బంది ఉన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం

ప్రజాపాలనలో స్వీకరించిన ఆరు గ్యారంటీల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని కలెక్టర్ విద్యుత్‌శాఖ కార్యదర్శికి వివరించారు. విద్యుత్ శాఖ కార్యదర్శి రిజ్వీ మంగళవారం కలెక్టర్లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. తెల్లరేషన్‌కార్డులు, ఆధార్‌కార్డుల వివరాలు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, మీటర్ వివరాలు సక్రమంగా ఉన్నవాటికి ఇప్పటికే రూ. 500 గ్యాస్, 200ల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. వివరాలు సరిగ్గా నమోదు చేసుకుని వారికి నూతనంగా ఏర్పాటు చేసే ప్రజాపాలన సేవాకేంద్రాల్లో సమర్పించాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అవసరమైన మేర దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ప్రజాపాలన సేవాకేంద్రాలపై అవగాహన కల్పించాలని, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుపై సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని రిజ్వీ సూచించారు.

సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

- డబ్బులు తీసుకొని నీటి విడుదల చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి
- కడెం మండల రైతాంగం డిమాండ్
- నిర్మల్, మంచిర్యాల రహదారిపై ధర్మాజీపేట్ వద్ద ఆందోళన
- రెండు గంటలపాటు స్తంభించిన రాకపోకలు

ఖానాపూర్, మార్చి 5 : సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ కడెం మండలంలోని కొత్తమద్దిపడగ, పాత మద్దిపడగ, లక్ష్మీసాగర్ తదితర గ్రామాల రైతులు మంగళవారం ఆందోళన చేశారు. నిర్మల్ - మంచిర్యాల ప్రధాన రహదారిపై సుమారు గంట పాటు బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఇరిగేషన్ అధికారుల సూచన మేరకే తాము పంటలను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అయినప్పటికీ తమ చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నీటి విడుదల కోసం రైతుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు నీటిని అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలకు పొంతన ఉండడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆయకట్టు వరకు నీరు అందేలా సదర్మాట్ కెనాల్‌కు నీటిని నిండుగా వదలాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న కడెం ఎస్సై రాజు రైతులను సముదాయించినా.. ఫలితం లేకుండా పోయింది. దీంతో కడెం ప్రాజెక్టు ఈఈ విఠల్ ఘటనా స్థలికి వచ్చి.. రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



ధర్మాపేట్ వద్ద ఆందోళన చేస్తున్న సదర్మాట్ రైతులు

కడెంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

ఖానాపూర్, మార్చి 5 : కడెంలో మంగళవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీగా నల్ల బెల్లం, పట్టిక పట్టుబడింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు నిర్మల్ ఎక్సైజ్ సూపరిండెంట్ అబ్దుల్‌రజాక్ తెలిపారు. నిషేధిత గుడుంబా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని విచారించగా కడెం మండల కేంద్రంలో పట్టిక, నల్లబెల్లం కొనుగోలు చేసినట్లు తేలిందన్నారు. దీంతో తాము కడెం మండల కేంద్రంలో దాడులు నిర్వహించగా ఐదు టన్నుల నిషేధిత నల్లబెల్లం, 3.5 క్వింటాళ్ల పట్టికను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీలను మరింత ముమ్మరం చేసి నిషేధిత గుడుంబా తయారీకి వినియోగిస్తున్న నుండి ముడి సరుకును విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం

ఖానాపూర్ గత మున్సిపల్ చైర్మన్‌పై విజిలెన్స్ విచారణ కోరుతాం

- మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ

ఖానాపూర్, మార్చి 5 : ఖానాపూర్ పట్టణ పరిధిలో గత మున్సిపల్ చైర్మన్ హయాంలో జరిగిన పనులపై విజిలెన్స్ విచారణ కోరుతామని మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం అలియాస్ చిన్నం సత్యనారాయణ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వార్షికబడ్జెట్ సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత పాలకులు ఎప్పుడు సమావేశం నిర్వహించిన మీడియాకు కార్యాలయంలోకి అనుమతి ఇచ్చేవారు కాదన్నారు. నియంత పాలన పోయి ప్రజా పాలన వచ్చిందనడానికి నిదర్శనంగా తాము చేపట్టే ఏ పనైనా ప్రజలకు తెలియాలనే మీడియా సమక్షంలో వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కోరానన్నారు. దానికి అదనపు కలెక్టర్ అనుమతించారన్నారు. గత చైర్మన్ హయాంలో పట్టణంలో జరిగిన మిషన్ భగీరథ, డంపింగ్ యార్డ్, మున్సిపల్ పార్క్ తదితర పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్నారు. ఆ పనుల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రోడ్డు వెడల్పు కోసం ఇప్పటికే రూ. 4.80 కోట్ల నిధులు మంజూరు అయ్యాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సహకారంతో ఖానాపూర్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు జన్నారపు విజయలక్ష్మి, నాయిని స్రవంతి, పరిమి లత, ఆఫ్రిన్ బేగం, గుగ్లావత్ కిషోర్‌నాయక్, కుర్మ శ్రీనివాస్, ఫౌజియా బేగం, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

ఖానాపూర్ మున్సిపల్ 2024-25 వార్షిక బడ్జెట్ ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. రూ. 37.36 కోట్ల నిధులను ఖర్చు చేయనున్నట్లు బడ్జెట్ అంచనాను ప్రభుత్వానికి పంపించారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

బాసర, మార్చి, 5 : బాసర పుణ్యక్షేత్రంలోని ప్రైవేటు లాడ్జీలు, అతిథి గృహాల్లో మంగళవారం పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముథోల్ సీఐ మల్లేషం ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగాయి. మూడు లాడ్జిల్లో కొందరు అసాంఘిక కార్యకలాపాలు చేస్తూ పట్టుబడ్డారని వారితో పాటు ఆ లాడ్జిల యజమానులపై కేసు నమోదు చేసినట్టు బాసర ఎస్ఐ గణేష్ ప్రకటనలో తెలిపారు. భక్తుల విడిది కోసమే గదులను అద్దెకివ్వాలని అసాంఘిక కార్యకలాపాలకు ఆశ్రయం ఇస్తే కఠినచర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు.

తరాటిలో ఆక్రమణల తొలగింపు

నర్సాపూర్(జి), మార్చి 3 : మండలంలోని తురాటి గ్రామంలో ఎస్సీ కాలనీలో రోడ్డును ఆక్రమించి కట్టిన కట్టడాలను మంగళవారం తొలగించి రోడ్డు వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు లక్ష్మణచాందలో ఎమ్మెల్యే పర్యటన

లక్ష్మణచాంద, మార్చి 5 : మండలంలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం పర్యటించనున్నట్లు నాయకులు సురకంటి ముత్యంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు

గ్రామాల్లో తాగునీటి
సమస్య లేకుండా చూడాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

పెంబి, మార్చి 5 : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షలో విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చేలాగా చూడాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రతీ గ్రామానికి త్రీఫేస్ కరెంట్ సౌకర్యం కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనుల ద్వారా కూలీలకు పని కల్పించే విధంగా చూడాలన్నారు. దోత్తివాగుపై అధికారులతో మాట్లాడుతానన్నారు. అధికారులు అందరూ సక్రమంగా పని చేయాలన్నారు. కమ్యూనికేషన్‌తో ముందుకు వెళ్లి అభివృద్ధి పనులు చేద్దామన్నారు. మండలంలోని వేణునగర్ గ్రామంలో గృహజ్యోతి కార్యక్రమం, కొలం కమ్యూనిటీ సంఘ భవనం, కొలం గూడ గ్రామంలో 5 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఎంపీపీ కవిత గోవింద్, తహసీల్దార్ లక్ష్మణ్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంఈవో మధుసూదన్, ఎఫ్ఆర్‌వో రామకృష్ణ, ఏవో రవి, ఏఈలు ఉదయ్, విష్ణు, శ్రీనివాస్, పశు వైద్యాధికారి విజయ్, తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా న్యాయాధికారి క్షమాదేశ్‌పాండే

జైనథ్, మార్చి5: సమాజంలోని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆదిలాబాద్ జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయవిజ్ఞాన సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. మంగళవారం జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు హక్కుల గురించి న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లింగ వివక్షను విడనాడి మహిళ సాధికారత సాధించే విధంగా ముందడుగు వేయాలన్నారు. మహిళలు అన్ని రంగాలలో సామాజిక, రాజకీయ, ఆర్థికపురోభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలో కామాయి జీపీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాధికా, శశికళ, కామాయి గ్రామా పెద్దలు కేతి రెడ్డి, సురేందర్‌రెడ్డిలతో పాటు పిప్పర్‌వాడ, కామాయి పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సన్మానం

ఖానాపూర్, మార్చి 5 : మండల కేంద్రంలోని తిమ్మాపూర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ, వైస్ చైర్మన్ కావలి సంతోష్‌లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు


నిర్మల్ జిల్లా మామడ మండలం బూరుగుపల్లి గ్రామంలోని శివాలయం

నిర్మల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోనే అతి పురాతనమైన శైవక్షేత్రం బూరుగుపల్లి శివాలయం శివరాత్రి పర్వదినానికి ముస్తాబైంది. మామడ మండలంలోని బూరుగుపల్లి గ్రామ శివారులో గల ఇక్కడి ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉందని చెబుతారు. అలాగే స్వయంగా వెలిసిన శివలింగం, అతిపెద్ద నంది విగ్రహం ఇక్కడి ఆలయ విశిష్టతకు పెట్టింది పేరు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించేందుకు ఆలయ పూజారులు వంజరి బాపురావు, సదాశివ్, రాంబాబుల నేతృత్వంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. శివరాత్రికి ఒక్కరోజు ముందు గురువారం శివపార్వతుల కల్యాణాన్ని పురస్కరించుకొని పందిరి మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇక్కడి ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చే వేలాది మంది భక్తుల కోసం అవసరమైన అన్ని వసతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్పిస్తున్నారు.

భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం : నిర్వాహకులు

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఇక్కడి ఆలయంలో ఘనంగా నిర్వహిస్తాం. ఈ సందర్భంగా గురువారం నుంచే ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గురువారం రోజు పందిరి మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. ఆ రోజు నుంచి మూడు రోజులపాటు నిర్విరామంగా పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతాయి. భక్తులకు వేసవితాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు ఎక్కడికక్కడ భారీగా టెంట్లను వేయిస్తున్నాం.

సూర్యపూర్ రాజరాజేశ్వర ఆలయంలో..

కుంటాల, మార్చి, 5 : కుంటాల మండలంలోని సూర్యపూర్ రాజరాజేశ్వర ఆలయంతో పాటు ఓలా శివాలయం శివరాత్రి పండగ జాతరకు ముస్తాబయ్యాయి. అంతేగాకుండా జాతర అనంతరం ఈ ఆలయాల ప్రాంగణంలో గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను సైతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మండలంలోని సూర్యపూర్ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలం నలుమూలల నుంచి కాకుండా పక్క మండలాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకుంటారు. అంతేగాకుండా ఇక్కడ నిర్వహించే కుస్తీ పోటీలలో మహారాష్ట్ర నుండి అధికసంఖ్యలో మల్లయోధులు పాల్గొంటారు.

భక్తుల కొంగుబంగారం కర్చల గుట్ట శివయ్య

దిలావర్‌పూర్, మార్చి 5 : మండలంలోని కాల్వ తండా శివారులోని కర్చల గుట్టపై వెలిసిన శివయ్య మహాశివరాత్రికి ముస్తాబవుతున్నాడు. గుట్టపై ఇరుకైనా పెద్ద బండ రాళ్ల మధ్య వెలిసిన శివయ్య భక్తుల కొంగు బంగారమై నీరాజనాలందుకుంటున్నారు. నాలుగేళ్ల క్రితం గుట్టపైకి వెళ్లిన పశువుల కాపరులకు పెద్ద బండ రాళ్ల మధ్య


కుంటాల మండలంలోని సూర్యపూర్ రాజరాజేశ్వర ఆలయం

త్రిశులాలు కనిపించడంతో గ్రామస్థులకు సమాచారమిచ్చారు. గ్రామస్థులు చెట్లను తొలగించి అక్కడ పరిశీలించగా చాలా పురాతనమైన శివలింగం బయట పడింది. దీంతో గ్రామస్థులు అక్కడ పూజలు ప్రారంభించారు. గ్రామస్థులు భక్తుల సహాయంతో అక్కడ అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా భక్తుల పూజలందుకొంటూ కోరిన కోరికలు నెరవేరుస్తున్నారు. మహా శివరాత్రి రోజు జాతర నిర్వహిస్తున్నట్లు వీడీసీ సభ్యులు, తాజా మాజీ సర్పంచ్ రామావత్ నీలాబాయి రవి తెలిపారు.

మొక్కులు నెరవేర్చే పశుపతినాథ్

ముథోల్, మార్చి 5 : నిర్మల్ జిల్లా నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని అతి పురాతనమైన పశుపతినాథ్ శివాలయం మహా శివరాత్రికి ముస్తాబైంది. మొక్కిన మొక్కులు తీర్చే ఇలవేల్పుగా విరజిల్లుతుంది. 2007 ఏప్రిల్ మాసంలోని 2వ తేదీన తవ్వకాల్లో భారీ శివలింగాలు బయటపడ్డాయి. కాకతీయ కాలంనాటి ఆలయం తవ్వకాల్లో బయటపడిందని, ఆలయం మహిమానిత్వం కలదని వయోవృద్ధులు తెలుపుతున్నారు.


ముథోల్ పశుపతినాథ్

ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రెండు రోజులపాటు ప్రత్యేక పూజలతో పాటు జాతర జరుగుతుంది. గ్రామ కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ జాతర అంగరంగ వైభవంగా జరుపుతారు. ఈ జాతరకు తెలంగాణ ప్రాంతం నుండే కాకుండా మహారాష్ట్ర నుండి సైతం భక్తులు తరలివస్తారు. కోరిన కోరికలు తీర్చే దైవంగా భక్తులకు నమ్మకం. ప్రతి సోమవారం ఆయా ప్రాంతాల నుండి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. అలాగే గత 14 సంవత్సరాల నుండి ఈ ఆలయంలో శివరాత్రి ముందు అఖండ హరినామ సప్తాహం నిర్వహిస్తారు. జాతర ముగింపు రోజు ఈ సప్తాహం ముగుస్తుంది. సప్తాహం ఏడు రోజులు భజన సంకీర్తనలు చేస్తారు. బాసర వచ్చిన భక్తులు ఈ పురాతన శివాలయం దర్శించుకునేందుకు ముథోల్‌కు వస్తుంటారు.

మహా శివరాత్రి సందర్భంగా శివాలయంలో ఈ నెల 8, 9 తేదీల్లో జాతర జరుగుతుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 8వ తేదీన ఉదయం 6 గంటలకు లింగోద్భవ పూజ రుద్రాభిషేకం, అభిషేకం పూజ, 9వ తేదీన ఉదయం 6 గంటలకు అభిషేకం అన్నపూజ, తదితర కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే మహా శివరాత్రికి మండలంలోని ఎడ్‌బిడ్, చించాల, రాంటెక్, తరోడా, వెంకటాపూర్, విట్టోలి, తదితర గ్రామాల్లో ఆలయాలు ముస్తాబు అవుతున్నాయి.


కర్చల గుట్ట శివయ్య దేవాలయం

ఆస్తి పన్ను బకాయిదారులకు ఊరట

● బకాయిల వడ్డీపై 90 శాతం రాయితీ

భైంసా, మార్చి 5 : మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను బకాయిలు ప్రతి యేటా పెరుగుతున్నాయి. ఏళ్ల తరబడి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ఇతరుల వద్ద నుంచి లక్షలాది రూపాయలు రావాల్సి ఉంది. పేరుకపోయిన బకాయిలను వసూలు చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం వడ్డీపై రాయితీని కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే వాటిని రాబట్టేందుకు ప్రభుత్వం బకాయి ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీనిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వడ్డీ మాఫీ కోసం వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. 2023-2024 ఆర్థిక సంవత్సరపు వరకున్న బకాయిలపై వడ్డీని 90 శాతం మాఫీ చేయనున్నారు.

● జిల్లాలో మూడు మున్సిపాలిటీలు

జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, భైంసా కలిపి మూడు మున్సిపాలిటీ కేంద్రాల పరిధిలోని ఇల్లు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు ఆస్తి పన్ను పరిధిలోకి వస్తాయి, వాటి ద్వారా మొత్తం రూ.6 కోట్లకు పైగానే బకాయిలున్నాయి. నిర్మల్ మున్సిపల్ పరిధిలో రూ.3.47కోట్ల బకాయిలకు గాను రూ.3.18 కోట్ల వడ్డీ రావాల్సి ఉండగా భైంసా మున్సిపల్ పరిధిలో రూ.2.08 కోట్ల బకాయిలకు రూ1.53 కోట్ల వడ్డీ, ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో రూ 76 లక్షలకు రూ. 34లక్షల వడ్డీ వసూలు కావాల్సి ఉంది. వడ్డీ పై వడ్డీ పడుతుండటంతో బకాయిలు పెరుగుతున్నాయని, అంత మొత్తాన్ని చెల్లించేందుకు పేదలు, ప్రభుత్వ సంస్థలు ముందుకు రావడం లేదని మున్సిపల్ అధికారుల సర్వేలో తేలింది. రాయితీ ప్రకటిస్తే పేరుకపోయిన బకాయిలు వసూలయ్యే అవకాశం ఉందని భావించిన పురపాలిక శాఖ ఓటీఎస్ పథకంపై నిర్ణయం తీసుకుంది.

● గతంలో రెండు సార్లు

గత ప్రభుత్వం రెండు పర్యాయాలు 2020-21,2022-23 ఆర్థిక సంవత్సరాల్లో ఓటీఎస్ పథకాన్ని అమలు చేసింది. అప్పుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని దీర్ఘకాలికంగా ఉన్న బకాయిదారులు పన్నులు చెల్లించారు. దీంతో ప్రజలు తక్కువ వడ్డీతో పన్నులు చెల్లించగా మున్సిపాలిటీలకు ఆదాయం చేకూరింది.



భైంసాలో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

● వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

(వెంకటేశ్వరరావ్, మున్సిపల్ కమిషనర్, భైంసా)

ప్రభుత్వం తెచ్చిన ఓటీఎస్ పథకానికి ఈ నెల 31 వరకు గడువు ఉన్నందున బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రధాన కూడలీల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పాటు ఆటోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నాం.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య పటేల్

నిర్మల్ కల్చరల్, మార్చి 5 : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్నూరు కులస్తుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్మల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో మున్నూరుకాపులను ఓటు బ్యాంకు గానే వాడుకుంది తప్ప ఏనాడూ వారి అభివృద్ధి గూర్చి పట్టించుకోలేదని ఆరోపించారు. బీసీ బందులోను చోటు కల్పించలేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా మున్నూరు కాపులను విస్మరించినందునే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లను కలిసి ఈ విషయాన్ని విన్నవించామన్నారు. హైదరాబాద్‌లో పేద విద్యార్థులకు వసతిగృహం, సంఘ భవనానికి 10 కోట్లు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా తమ డిమాండ్లపై జిల్లాలవారీగా పాదయాత్రలు చేపడతామని, హైదరాబాద్‌లో ఐదు లక్షల మందితో సింహగర్జన నిర్వహిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎండీ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి పటేల్, యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, మహేందర్, అయ్యన్నగారి భూమయ్య, ఎంసీ లింగన్న, ధర్మాజీ రాజేందర్, గుమ్ముల అశోక్, హన్మండ్లు, కొట్టే శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండాలి

మున్నూరు కాపు కుల బంధువులు ఐక్యంగా ఉండాలని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం విశ్రాంత ఉద్యోగ సంఘ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్నూరు కాపు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు కోసం జిల్లా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్నూరు కాపులను చైతన్య పరుస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కార్పొరేషన్ ఏర్పాటు, రెండెకరాల భూమి, ఆత్మ గౌరవ భావన నిర్మాణం, రాజకీయ రంగంలో తగు ప్రాధాన్యం తదితర అంశాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు. నిర్మల్ వచ్చిన దేవయ్య పటేల్‌ను మర్యాద పూర్వకంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎంసీ లింగన్న, అయ్యన్నగారి భూమయ్య, మున్నూరు కాపు కుల సోదరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేవయ్య పటేల్

ఆదిలాబాద్ అర్బన్ : పార్లమెంట్ కంటే ముందే మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ప్రభుత్వాలు ప్రకటించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య అన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్‌కు వచ్చారు. స్థానిక మున్నూరుకాపు సంఘ భవనంలో నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో మున్నూరుకాపులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలోని ఆయా కులాలకు న్యాయం చేసిందన్నారు. కాని మున్నూరుకాపులను తగిన స్థాయిలో న్యాయం చేయలేక పోయిందన్నారు. ఫైనాన్స్ కార్పొరేషన్ ఇవ్వాలని ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒత్తిడి తీసుకువచ్చిన ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కార్పొరేషన్ ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పుడు దాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం తాలుకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్లవిఠల్, కలల శ్రీనివాస్, రఘుపతి, గంట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు సన్మానం

నిర్మల్ కల్చరల్, మార్చి 5 : నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావును మంగళవారం రజక సంఘం నాయకులు సన్మానం చేశారు. నాయకుడు పోశెట్టి ఆధ్వర్యంలో జరిగిన సన్మానంలో తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, డి.శ్రీపాదరావు విగ్రహాలను హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మారాజు గంగాధర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన మోకుదెబ్బ కమిటీ

నిర్మల్ కల్చరల్, మార్చి 5 : బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం గౌడజన హక్కుల పోరాట సమితి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు. గీత కార్మికుల గౌడ కులస్తుల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ, రాష్ట్ర నాయకులు అమరవేణి నర్సాగౌడ్, రాగుల సిద్ధిరాములు, న్యాయవాది సురేష్ గౌడ్, బాలేశంగౌడ్, ముత్యం, నర్సింలు గౌడ్, ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


యజ్ఞంలో పాల్గొన్న గ్రామస్థులు

పొన్నారిలో మహాయజ్ఞం

తాంసి, మార్చి 5 : మండలంలోని పొన్నారి గ్రామంలో మంగళవారం మహాయజ్ఞం నిర్వహించారు. గ్రామసమీపంలో అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు సైతం హాజరయ్యారు. అనంతరం పెద్ద ఎత్తున గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అధ్యాత్మిక చింతనతోనే మనసుకు శాంతి

● ఎమ్మెల్యే అనిల్ జాదవ్


పొన్నారి పాఠశాలలో డిజిటల్ టీవీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడే మనసుకు శాంతి కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌యాదవ్ అన్నారు. మంగళ వారం హస్నాపూర్, పొన్నారి గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామస్థులు మేళతాళాల మధ్య స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో భక్తి పెరిగినప్పుడే ఆలోచన విధానంలో కూడా మార్పు వస్తుందన్నారు. ఆలయాల అభివృద్ధి కోసం తనవంతు ప్రత్యేక నిధులను కేటాయిస్తానని అన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి గ్రామం అభివృద్ధి కోసమే కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు రేఖారఘు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో కష్టపడి చదవాలి

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని పొన్నారి జిల్లా పరిషత్ పాఠశాలలో నూతనంగా మంజూరైన డిజిటల్ టీవీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాసుకోవడానికి పెన్ను సైతం దొరికేది కాదని కాని ప్రస్తుతం అన్ని ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయని అన్నారు. డిజిటల్ టీవీ పాటలతో విద్యార్థులు మరింత పురోగతిని సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని అప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు సర్పంచ్ అశోక్, గ్రామస్తులు లింగారెడ్డి, చిన్నయ్య, ప్రకాష్, వెంకటరమణ, ఎంపీటీసీ రేఖ, రఘు, భోజన యాదవ్ పలువురు ఉన్నారు.

ప్రధాని మోదీ జిల్లా పర్యటన.. టైంపాస్ టూర్

● డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 5: దేశ ప్రధాని మోదీ ఆదిలాబాద్ పర్యటన ఒక టైంపాస్ టూర్ అని డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రజాసేవాభవన్‌లో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీ, టెక్స్‌టైల్‌పార్కు, విమానాశ్రయం, సీసీఐ, ఆదిలాబాద్ ఆర్మూర్ రైల్వేలైన్ దీర్ఘకాలిక డిమాండ్ల పై మోదీ ఒక హామీ కూడా ఇవ్వకుండా కేవలం రాజకీయంగా విమర్శలు చేసి వెళ్లి పోయారని మండిపడ్డారు. కేవలం ఎన్నికల కోసమే వచ్చారని, ప్రజలను మరోసారి మభ్యపెట్టారని ఆరోపించారు. మూడు నెలల్లో 30వేల ఉద్యోగాల్చిన తమ కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు తగవని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో కాంగ్రెస్‌ను పోల్చడాన్ని తప్పుబట్టారు. ఆదిలాబాద్ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్రధాని మోదీ బీజేపీ విజయ సంకల్పసభ ఉత్తుత్తి సభ అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దిగంబర్‌రావుపటేల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నగేష్, సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్ రావు, మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మ పాల్గొన్నారు.

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.3, కనిష్ఠం 17.7

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

బుధవారం 6 మార్చి 2024

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

ఉట్నూర్, మార్చి 5: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులో తెచ్చామన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ద్వారా సబ్సిడీ గ్యాస్ సిలిండర్, జీరో కరెంట్ చార్జీలు అందని వారు సేవా కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్, ఉద్యోగులు పాల్గొన్నారు.



సిరికొండ మండలం కుంటగూడలో సోలార్ పంప్ సెట్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు



తలమడుగులో వ్యవసాయ బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

ముంచుకొస్తున్న జలముప్పు!

- జిల్లాలో ఆందోళనకరంగా మారిన భూగర్భ జలాలు
- ఇప్పటికే పలు గ్రామాల్లో మొదలైన తాగునీటి కష్టాలు
- జైనథ్‌లో అత్యధికంగా 13.32 మీటర్ల లోతులోకి నీటిమట్టం
- రోజురోజుకూ ముదురుతున్న ఎండలు
- గరిష్ఠంగా నమోదవుతున్న 38 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు
- అధికారులకు ముందుచూపు కరువు
- ఓ అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా మిషన్ భగీరథ పథకం నిర్వహణ తీరు
- ఇప్పటికే వందలాది గ్రామాలకు సక్రమంగా అందని తాగునీరు
- జిల్లావ్యాప్తంగా వ్యవసాయ బోరు బావులు సైతం ఎండిపోతున్న వైనం



ఆదిలాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి కాలం ప్రారంభంలోనే భూగర్భ జలమట్టం వేగంగా పడిపోవడం ఆందోళన రేపుతోంది. ప్రతీసారి జిల్లాలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. గిరిజన మారుమూల గ్రామాల్లోనైతే మరీ దారుణ పరిస్థితులు ఉంటాయి. కిలోమీటర్ల మేర వెళ్లి తాగునీటిని తీసుకొచ్చుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ యేడు జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసినా.. వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలాలు అడుగంటుతున్నా యి. ఎండలు ముదురడంతో నీటిజాడలు అడుగంటుకు పోతున్నాయి. జిల్లాలో గరిష్ఠంగా 38 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మార్చి మాసంలోనే ఇలా ఉంటే.. రాబోయే ఏప్రిల్, మే మాసాలలో పరిస్థితి మరెలా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే జిల్లా సాధారణ వర్షాపాతం 1193 మి.మీ.లు కాగా, ఈయేడు అధికంగా 1462 మి.మీ.ల వర్షాపాతం నమోదైంది. జైనథ్ మండలంలోని బోరజ్‌లో అత్యధికంగా 13.32 మీటర్ల లోతులోకి భూగర్భజలాలు పడిపోగా.. ఇంద్రవెల్లి మండలం ముత్నూర్‌లో 11.00 మీటర్లు, నేరడిగొండ మండలంలో 9.90, గుడిహత్నూర్ మండలంలో 9.62 మీటర్లకు భూగర్భ జలమట్టం పడిపోయినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. కాగా, జైనథ్ మండల కేంద్రంలో 2.54మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా సాధారణ భూగర్భ నీటిమట్టం 7.04 మీటర్లుగా నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. బేల, ఉట్నూర్, తలమడుగు, ఇంద్రవెల్లి, సిరికొండ, బజార్‌హత్నూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి మొదలైంది. అలాగే వ్యవసాయ బోరు బావులు కూడా ఎండిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకుంటున్నారు. వేసవి ప్రారంభంకావడంతో అధికారులు అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం తాగునీటి సమస్యపై జిల్లా అధికారులను హెచ్చరించింది. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

దాహం తీర్చని 'మిషన్ భగీరథ'

గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన మిషన్ భగీరథ పథకం.. జిల్లాలో ఓ అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. జిల్లాలో వందలాది గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ప్రతిసారి జడ్పీ సర్వసభ్య సమావేశంలో మిషన్ భగీరథ లోపాలపై సభ్యులు హెచ్చరిస్తున్నా.. పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. తరచూ మరమ్మతులు రావడంతో అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు. తలమడుగు మండలంలో చాలా గ్రామాలకు 'మిషన్ భగీరథ' నీరు సరఫరా కావడం లేదని స్థానిక జడ్పీటీసీ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా.. ఫలితం కనిపించడం లేదు. ఇలా ఇంద్రవెల్లి, సిరికొండ, నార్నూర్, ఉట్నూర్ మండలాల్లో చాలా గ్రామాలు 'మిషన్ భగీరథ'కు దూరమవుతున్నాయి. వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిన దాహం తీర్చని పథకంగానే మిగిలిపోతోంది. జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలోనే అత్యధికంగా భూగర్భ జలాలు పడిపోవడం ఆందోళన రేపుతోంది. ముఖ్యంగా జిల్లాలో కొండ ప్రాంతాలు ఎక్కువ కావడం, అలాగే నల్లరేగడి నేలలు ఉండడంతో వర్షపు నీరు భూగర్భ జలంగా మారడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

ఏజెన్సీలో మొదలైన నీటి కష్టాలు

జిల్లాలోని ఏజెన్సీ మారుమూల గ్రామాలలో నీటి కష్టాలు మొదలయ్యాయి. ముఖ్యంగా సిరికొండ మండలం కుంటగూడ, పాలవాగు, తిమ్మాపూర్, సూర్యపేట్, చింతగూడ, రాజంపేట్, రిమ్మ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తాగునీటి కోసం సోలార్ పంప్‌సెట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పంపు సెట్ల ద్వారానే ప్రజలు దాహం తీర్చుకుంటున్నారు. అలాగే తలమడుగు మండలంలో పల్సి(బి), పల్సి తండా, రత్నాపూర్ గ్రామాలతో పాటు ఇంద్రవెల్లి మండంలో వడ్గర్‌గూడ, దొడందా, బుర్సంపటా, గట్టిపల్లి గ్రామాలలో నీటిఎద్దడి తీవ్రంగా కనిపిస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఏజెన్సీలో తాగునీటి ఇబ్బందులను దూరం చేసేందుకు ప్రభుత్వాలు తాగునీటి పథకాలను చేపడుతున్న శాశ్వత పరిష్కారం కావడం లేదు. దీంతో ప్రతియేటా వేసవిలో తాగునీటి తండ్లాటనే కనిపిస్తోంది. 'మిషన్ భగీరథ'తో సమస్యలు దూరమవుతాయని అందరూ భావించినా.. ఆ పథకం అందని ద్రాక్షగానే మారింది. ఈసారి ఫిబ్రవరి, మార్చిలోనే రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వేగంగా నీటి వనరులు అడుగంటుక పోతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైతేనే ఆపదలు దూరమవుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మిషన్ భగీరథ పథకం నీరు రావడం లేదు

: పెందూరు గంగాధర్, మాజీ సర్పంచ్, వాయిపేట్, సిరికొండ మండలం



గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 'మిషన్ భగీరథ' ద్వారా నీరు సరఫరా కావడం లేదు. దీంతో గతంలో మాదిరిగానే తీవ్రమైన నీటిఎద్దడి తలెత్తుతోంది. గత్యంతరం లేక ప్రజలు వ్యవసాయ బావులు, పంపు మోటార్ల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఎన్నిసార్లు చెప్పినా ఆదివాసీ గిరిజన గూడాలకు 'మిషన్ భగీరథ' ద్వారా నీటిని సరఫరా చేయడం లేదు. అసలే వేసవి కాలం.. ఆపై నీటి ఇబ్బందులతో జనం అల్లాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పథకం ద్వారా నీటిని సరఫరా చేయాలి.

సంక్షిప్త సమాచారం

సీఎం ఏపీఆర్వోగా అన్వేష్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 5: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదనపు ప్రజా సంబంధాల అధికారి (ఏపీఆర్వో)గా పుంద్రు అన్వేశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం అధికారిక ఉత్తర్వులు వెల్లడయ్యాయి. అనురాగ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అన్వేష్‌రెడ్డి స్వస్థలం జిల్లాలోని పొచ్చెర గ్రామం. తండ్రి మోహన్‌రెడ్డి బేల మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. గత 30 ఏళ్లగా వీరి కుటుంబం ఆదిలాబాద్‌లోనే ఉంటోంది.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 5: ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ ఉర్దూ మీడియా అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.అచ్చి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీ సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55శాతం మార్కులు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉన్న అర్హులేనన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, బోధన అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రం సమర్పిస్తే వెయిటేజ్ ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల 9 లోగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు సమర్పించి 11న ఉదయం 10గంటల నుంచి జరిగే డెమోకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉరేసుకుని ఇద్దరి మృతి

జైనథ్, మార్చి5: మండల కేంద్రంలో మంగళవారం వేర్వేరు కారణాలతో ఇద్దరు ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్సై కె.పురుషోత్తం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. జైనథ్‌కు చెందిన ఇప్పసుధాకర్(35) మద్యానికి బానిసై తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం ఉదయం ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే జైనథ్‌కు చెందిన కనకరాందాస్(70) మంగళవారం మధ్యాహ్నం కాళ్ల నొప్పులు భరించలేక తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసులు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

భీంపూర్: అనారోగ్యంతో ఉరి వేసుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులకు, కుటుంబీకుల వివరాల ప్రకారం మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన అయినవేని నర్సింలు (65) అనే వృద్ధుడు మంగళవారం ఉదయం కమానికి అనుకున్న ఉన్న చేనులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. కొడుకు లచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు.

వైన్స్‌షాప్‌పై దాడి : ఒకరి అరెస్టు

భీంపూర్, మార్చి 5: మండల కేంద్రంలోని వైన్స్ షాప్‌లో ఉద్దెర మద్యం ఇవ్వడం లేదని గుంజాల గ్రామానికి చెంది కుంరా రాము అనే యువకుడు గొడ్డలితో దాడి చేసి వైన్స్ సిబ్బందిని గాయపరిచాడు. కాగా, వారి ఫిర్యాదు మేరకు భీంపూర్ పోలీసులు అతడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కమ్యూనికేషన్ కోసమే మొబైల్ వాడాలి



జెండా ఊపి టూ కే రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

- టూ కే రన్ ప్రారంభించిన ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 5: మొబైల్ ఫోన్ కేవలం కమ్యూనికేషన్ కోసమే వాడాలని, కాలక్షేపం కోసం కాదని ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. మంగళవారం మొబైల్ ఫోన్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఒక్లే ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో టూ కే రన్‌ను నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి నుంచి ఎస్పీ గౌస్‌ఆలం, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండేలు ముఖ్య అతిథులుగా హాజరై టూ కే రన్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఇందులో పాల్గొని ఫోన్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఫోన్ల వినియోగం పెరిగిందని, అవసరమున్నంత వరకే ఫోన్లను వినియోగించాలని, 99 శాతం చిన్నారులకు ఫోన్లతో పని ఉండదన్నారు. కానీ వారు కాలక్షేపం కోసం వాడుతున్నారని, ఇదిలా చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో తప్ప మిగితా సమయంలో ఫోన్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఫోన్లను ఇవ్వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిన్నికౌర్ ఆహ్లువాలియా, సాయిని రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆదివాసీ గిరిజన భాషల సంరక్షణకు కృషి'

ఉట్నూర్, మార్చి 5: రాష్ట్రంలోని ఆదివాసీ గిరిజనుల భాష సంరక్షణ కోసం వాటిని వీకీపీడియాలో చేరుస్తున్నామని బోలిచేతో ప్రతినిధి ఆత్రం మోతీరాం అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని గిరిజన మేధావులతో నిర్వహించిన తెలంగాణ ఆదివాసీ స్వేచ్ఛ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి బోలిచేతో సీఈవో నేతి సాయికిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆత్రం మోతిరాం మాట్లాడుతూ అంతరించి పోతున్న ఆదివాసీ గిరిజనులు కోలాం, తోటి భాషల సంరక్షణ కోసం, వాటి మనుగడ కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. వీకీ పీడియాలో 320 భాషలు చేర్చడం జరిగింద న్నారు. ప్రపంచంలో ఏడు వేల భాషలు ఉన్నాయని ఆదివాసీ భాషల పునరుద్ధరణ కోసం ఈ కార్యక్రమం తమ సంస్థ ద్వారా చేపడుతున్నామన్నారు. 2022 నుంచి 2032 వరకు ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ భాషల దశాబ్దాంగా ప్రకటించింది అన్నారు. అయితే, 2021లో ఈ ప్రకటన వచ్చిందని అన్నారు. దేశంలో 16 వందల మాతృభాషలకు ప్రమాదం ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో కోలామి భాష కూడా ఉండడం గమనార్హం అన్నారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో గోండు మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు సిడాం అర్జు, జిల్లా రాయి సెంటర్ అధ్యక్షుడు మెస్రం దుర్గు, మేధావులు కోరింగ దౌవలత్ రావు, అరక మాణిక్‌రావు, చాకటి దస్రు, శ్రీనివాస్‌రెడ్డి, దశరథ, తొడసం కైలాస్, వికాస్‌తో పాటు ఆల్ ఇండియా రేడియో ప్రతినిధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డుల తనిఖీ

బోథ్, మార్చి 5: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఆయా అంశాలకు చెందిన రికార్డులను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో శానిటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం పన్నుల వసూలు ఏ మేరకు జరిగిందని అగిడి తెలుసుకున్నారు. అంతేగాక విశ్వకర్మ యోజన కింద ఎంపికైన లబ్ధిదారులను ఏ విధంగా గుర్తించారని పంచాయతీ ఈవో అంజయ్యను అడిగి తెలుసుకున్నారు. ఇందులో డీపీవో వెంట ఎంపీవో మహేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

జిల్లాలో పండుగ వాతావరణం : ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 5: దాదాపు 44 ఏళ్ల తర్వాత దేశ ప్రధాని ఆదిలాబాద్‌కు రావడంతో పండుగ వాతావరణం నెలకొందని, సభా సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి జిల్లా సమస్యలను విన్నవించడం జరిగిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాని సభ విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు కనీవిని ఎరుగని రీతిలో ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి 3వసారి ప్రధాని మోదీ అవుతారని భరోసా కల్పించారన్నారు. జిల్లా సమస్యల గురించి ప్రధానమంత్రికి విన్నవించడం జరిగిందని, దానిపై సానుకూల స్పందన వచ్చిందన్నారు. అధికారిక కార్యక్రమాల శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి స్వాగతం పలికారని, ఈ పరిణామం జిల్లా అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఇందులో అంకత్‌రమేష్, రాథోడ్ జనార్ధన్, ఆదినాథ్ బ్రహ్మానంద్, విజయబోయర్, మయూర్‌చంద్ర, ఆకుల ప్రవీణ్, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రధానికి జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు'

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 5: జిల్లా అభివృద్ధిపై కనీస చిత్తశుద్ధి లేని ప్రధాని ఇతర జిల్లాల్లో చేపట్టబోయే ప్రాజెక్టులకు జిల్లా నుంచి ప్రారంభోత్సవాలు చేయడం ఏంటని మాజీ మంత్రి జోగు రామన్న ప్రశ్నించారు. మంగళవారం స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడా భాయ్ చోటా భాయ్ నిర్వహించిన వేదిక ద్వారా జిల్లా ప్రజలకు చేకూరింది ఏమీ లేదని, ప్రభుత్వ ఖజానా ఖర్చు చేస్తూ ప్రజలను మభ్య పెట్టడమే తప్ప, జిల్లా వాసుల ఏళ్ల నాటి కలలనుసాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాగా ప్రధానమంత్రి పర్యటనతో జిల్లా ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారని పేర్కొన్నారు. సీసీఐ పునరుద్ధరణ, టెక్స్‌టైల్ పార్కు, రైల్వేలైన్ వంటి అనేక హామీలపై ప్రజలు కోటి ఆశలతో ఉన్నారని, వారి ఆశలపై ప్రధాని నీళ్లు చల్లారని ఆరోపించారు. ఇప్పటి వరకు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చేసిన ప్రకటనలు అవాస్తవాలని తేలిందన్నారు. కేవలం కాంగ్రెస్, బీజేపీల అంతర్గత బట్టబయలు చేసేలా ఈ పర్యటన సాగిందని విమర్శించారు.





హనుమాన్ ఆలయంలో వానర పూజలు

- ఆసక్తిగా తిలకించిన భక్తులు

తలమడుగు, మార్చి 5: మండలంలోని కోసాయి గ్రామం సమీపంలోని మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో గల అతి పురాతనమైన హనుమాన్ ఆలయంలో మంగళవారం హనుమాన్ ఆలయంలో వానరుడు ప్రత్యక్షమై ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి హనుమాన్ విగ్రహం ముందు గల పూలు పత్రిని తీసుకొని అంజనేయ స్వామికి పూజలు చేసింది. అనంతరం స్పష్టంగా రెండు చేతులు జోడించి అంజనేయ స్వామిని వేడుకుంది. అంతే కాకుండా భక్తులు సమర్పించిన నైవేద్యాన్ని ఆరగించి అడవి ప్రాంతానికి వెళ్లిపోయింది. ఈ దృశ్యాన్ని గ్రామస్థులతో పాటు భక్తులు ఆసక్తిగా తిలకించారు. కోసాయి హనుమాన్ ఇంత పవిత్రమైందని ఇక్కడికి స్వష్టంగా ఆంజనేయ స్వామి దిగి వచ్చారని భక్తులు చర్చించుకుంటున్నారు.

కోసాయి హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న వానరం

సీఎం రేవంత్‌రెడ్డికి నాలుగో తరగతి ఉద్యోగుల క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 5: 1వ తేదీన వేతనాలు ఇస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆదిలాబాద్ యూనిట్ మంగళవారం క్షీరాభిషేకం చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్‌ల ఆదేశాల మేరకు జిల్లా సంఘ నేతలు ఈ కార్యక్రమం తలపెట్టారు. జిల్లా కార్యదర్శి కె.ఇంద్ర, జిల్లా సహాయ అధ్యక్షుడు ఎం.రమేష్, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు ఎండీ అయుబ్‌ఖాన్, సంయుక్త కార్యదర్శి పులిబాయి, ఇతర సభ్యులు ఆదిలాబాద్ సంఘ భవనంలో మంగళవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయానికి వేతనాలు రాక గత పదేళ్లగా ఇబ్బంది పడ్డామని, జీపీఎఫ్, మెడికల్, సరెండర్ బిల్లులు సమయానికి రాక అవస్థలు పడ్డామని, రేవంత్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి ఆ సమస్యలన్నీ పోయాయని హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యే అభినందన

నేరడిగొండ, మార్చి 5: ఇటీవల బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగిన 41వ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ తెలంగాణ మొదటి స్థానంలో నిలిచి స్వర్ణ పతాకాన్ని సాధించింది. అయితే, ఈ గౌరవాన్ని దక్కించిన వారిలో మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు డి.శిరీషా, ఎం.అలేఖ్య, బి.వనతి ఉన్నారు. స్పెషల్ ఆఫీసర్ రజిత, పీఈటీ స్నేహ ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించామని విద్యార్థినులు తెలిపారు. కాగా, విద్యార్థినులతో పాటు ఉపాధ్యాయ బృందానికి కలెక్టర్ రాహుల్‌రాజ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అభినందనలు తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

సిరికొండ, మార్చి 5: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పెందూర్ అమృత్‌రావు అధ్యక్షతన సాదాసీదాగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ పరిధిలో జరిగిన పలు అభివృద్ధి కార్యకలాపాలను సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభం కావడంతో పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తెచ్చారు. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు తక్షణమే తగు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతీ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ కూలీకి పని కల్పించే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాల గంగాధర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్, వైస్ ఎంపీపీ సాబ్లె సాగరబాయి, ఎంపీటీసీలు మారుతి, సూర్యకాంత్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.